# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యారంగంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.**
2. **కాళేశ్వరం కమిషన్ నివేదికపై తదుపరి కార్యచరణ గురించి చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది.**
3. **రైతుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు.**
4. **హైదరాబాద్ నుంచి విజయవాడకు త్వరితగతిన చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రహదారి రానుందని తెలంగాణా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలో గ్రానైట్ క్వారీలో బండరాళ్లు పడి ఆరుగురు కార్మికులు మృతి చెందారు.**

==========================

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యారంగంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తోందని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం నడిపిల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో నిర్మించిన నూతన తరగతి గదులను ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

--------------------------

కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చించి తదుపరి కార్యచరణ గురించి చర్చించేందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుంది. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై కమిషన్ నివేదికను ముగ్గురు అధికారుల కమిటీ అధ్యయనం చేసి సమర్పించనుంది. కాగా రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం ఈనెల రెండో వారం జరగాల్సి ఉన్నప్పటికీ.. కమిషన్ నివేదికపై చర్చించేందుకు మంత్రివర్గం ఈరోజు సమావేశం కానుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

సంచార జాతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవ్ తెలిపారు. స్ఫూర్తి పేరిట విజయవాడలో నిర్వహించిన సంచార, అర్ధ సంచార విముక్త జాతుల ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశంలో మాధవ్ నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంచార జాతులు సంస్కృతికి సారథులని చెప్పారు. వారి సమస్యలు పరిష్కరించేందుకు నిర్దిష్టమైన ప్రణాళిక రూపకల్పన కోసం బీజేపీ కృషి చేస్తుందని మాధవ్ తెలుపుతూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

రైతుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా, మక్కువ మండలం శంబర గ్రామ సమీపంలో వెంగళరాయ సాగర్ జలాశయం నుండి సాగునీటిని మంత్రి నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెంగళరాయ సాగర్ రిజర్వాయర్ నుండి ప్రస్తుతం కుడి ప్రధాన కాలువ ద్వారా 306 క్యూసెక్కులు, ఎడమ విధాన కాలువ ద్వారా 193 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా జిల్లాలోని మూడు మండలాల్లో మొత్తం 24 వేల 7 వందల ఎకరాల పంటలకు సాగునీరు అందుతుందని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలో గ్రానైట్ క్వారీలో నిన్న బండరాళ్లు పడి ఆరుగురు కార్మికులు మృతి చెందారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కార్మికులను మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను జిల్లా కలెక్టర్ వెంకట మురళి పరామర్శించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ 31 సెకన్లు

మరోవైపు క్వారీ ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రమాదానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

---------------------------

తల్లి పాల ఆవశ్యకతను తెలియజేస్తూ ప్రపంచ ఆరోగ్య సంస్థ తీర్మానం మేరకు తల్లి పాల వారోత్సవాలు జరుగుతున్నాయి. ప్రతి ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు వారంరోజులపాటు ప్రపంచ దేశాలు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. తల్లి పాల విశిష్టతను తెలియజేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వారం రోజుల పాటు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. తల్లి పాల వారోత్సవాల సందర్భంగా ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

హైదరాబాద్ నుంచి విజయవాడకు త్వరితగతిన చేరుకునేలా గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణం రానుందని తెలంగాణ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఎల్బీనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట్ వరకు నిర్మించే ఎలివేటెడ్ కారిడార్‌ను మంత్రి నిన్న క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కారిడార్‌కు సంబంధించిన సమగ్ర నివేదికను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి అందిస్తామని ఆయన పేర్కొంటూ..

వాయిస్ 32 సెకన్లు

---------------------------

ప్రముఖ తెలుగు కవి కరుణ శ్రీ జంధ్యాల పాపాయ్య శాస్త్రి జయంతి ఈరోజు. ఈ సందర్భంగా తెలుగు కవిత్వానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1912 ఆగస్టు 4వ తేదీన గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం కొమ్మూరు గ్రామంలో జన్మించిన పాపాయ్య శాస్త్రి 20వ శతాబ్ధంలో జనాదరణ పొందిన తెలుగు కవులలో ఒకరు. సులభ శైలిలో సమకాలీన ధోరణిలో చక్కని తెలుగు నుడికారంతో వినసొంపైన ఖండ కావ్యాలతో ఆయన రచనలు సాగేవి. కరుణ రస ప్రధానమైన అనేక కవితలు రాసి ‘కరుణశ్రీ’ గా సుప్రసిద్ధులయిన ఆయన 1992 జూన్‌లో కన్నుమూశారు.

---------------------------

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లండన్‌లోని ఓవల్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఐదవ క్రికెట్ టెస్ట్ మ్యాచ్‌లో నిన్న ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ జట్టు 6 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. ఈ మ్యాచ్ లో ఇంగ్లాండ్ జట్టు విజయం సాధించేందుకు ఇంకా 35 పరుగులు చేయాల్సి ఉంది. ఇంగ్లాండ్ జట్టు నుంచి జేమీ స్మిత్, ఒవర్టన్ క్రీజులో ఉన్నారు. ఈ రోజు ఆట కొనసాగనుంది.

---------------------------

నైరుతి బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి బి. శేఖర్ తెలియజేస్తూ....

వాయిస్...15 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ రానున్న రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================